క్లుప్తంగా

గుంటూరు వెళ్లి.. పింఛను అందజేత



అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన నాగం సాంబయ్య పింఛనుదారుడు అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వలంటీరు దేగల శ్రీనివాసరావు శుక్రవారం వైద్యశాలకు వెళ్లి రూ.3000 పెన్షన్ అందచేశారు. వలంటీరుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

అచ్చంపేట ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



అచ్చంపేట: ఎంపీడీవోగా కె.కుసుమకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన పి.శివసుబ్రమణ్యం ప్రకాశం జిల్లాకు బదిలీకాగా, అదే జిల్లా నుంచి కుసుమకుమారి ఇక్కడకు వచ్చారు.

అప్రెంటీస్ విధానం వెనక్కి తీసుకోవాలి

సత్తెనపల్లి: కొత్తగా డీఎస్సీలో ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలు అప్రెంటిస్‌గా పని చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఈ నిర్ణయం సరైంది కాదని పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బంకా వాసుబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పీఆర్‌టీయూ పోరాటాల వల్ల ఆనాడు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయిస్తూ జీవో 2ని తీసుకురావడం జరిగిందన్నారు. దానిని మరలా తీసుకురావడంతో.. అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. డీఎస్సీలో 6,100 టీచర్ పోస్టులను భర్తీ చేయడం విద్యా రంగంలో శుభ పరిణామమని, అదే విధంగా ఇంటర్నేషనల్ బకాలరియేట్ (ఐబీ) సిలబస్‌తో ఒప్పందం చేసుకోవడం వల్ల మన రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగల సామర్థ్యాలను పెంపొందించుకుంటారని ఆనందం వ్యక్తం చేశారు.

అనంతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి షాహిదా పర్యవేక్షణలో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎం.రాజేష్ , డాక్టర్ సిరిచందన, పీజీ వైద్యులు పాల్గొన్నారు. 169 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం పద్మ, ఎంపీటీసీ గోగిరెడ్డి, వేణుగోపాలరెడ్డి, ఏపీఎం సీహెచ్ అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కూచిపూడి ప్రభావతి, ఫార్మసిస్టు ఫాతిమా , ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

310 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: కోట నెమలిపురి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ సుష్మ(జనరల్ సర్జన్), డాక్టర రవిశంకరరెడ్డి(ఆర్థోపెడిక్), డాక్టర రవితేజ నాయక్(జనరల్)లు 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు షేక్ మున్నీరు 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, పలువురికి కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. అనంతరం డాక్టర రవితేజ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతీ ఒక్కరూ జగనన్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ గ్రామంలో నెలకు 2 సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవనరావు, ఉషారాణి, ఎంఎల్‌పీలు ప్రియదర్శిని, లక్ష్మీదుర్గా, ఏఎన్ఎంలు, రెహిన, శారద, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య శ్రీ కార్డులు అందాలి

నకరికల్లు: మండలంలోని గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి బి.బాలు నాయక్ శుక్రవారం సూచించారు. ఇందుకు గ్రామాల వారీగా సిబ్బందిని నియమించామన్నారు. వారు వలంటీర్లు, ఏఎన్ఎంల సహకారంతో కార్డుల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. మంజూరైన ప్రతీ ఒక్కరికి కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని దుకాణాలు, వ్యాపారాలు ఈ నెల ఆఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ అధికారి జి.నగరాజ తెలిపారు. పట్టణంలోని కార్మిక శాఖ చట్టం ప్రకారం ప్రతి షాపు వారి దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె తెలిపారు.

నవజాత శిశువులకు నవీన రక్షా కవచం

- ఏరియా వైద్యశాలలో ప్రత్యేక సంరక్షణ కేంద్రం
- రూ.20లక్షలతో అభివృద్ధి.. 24 గంటలూ వైద్యం



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల భవనం

ఇదికదా.. అభివృద్ధి

సత్తెనపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలలను బలోపేతం చేసి, అవసరమైన మందులు, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుతున్నారు. ఈ క్రమంలోనే సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో శిశువుల ఆరోగ్య సంరక్షణకు అధునాతన నవజాత సంరక్షణ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. రూ.20 లక్షలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి, అధునాతన పరికరాలను సమకూర్చారు. ఆ యూనిట్‌ను ఇటీవల రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు.

ప్రత్యేక ప్రమాణాలతో...

- నవజాత శిశువుల ఆరోగ్య స్థితిని మెరుగు పరచడానికి ప్రత్యేక ప్రమాణాలు, అన్ని సౌకర్యాలతో ప్రత్యేక వార్డును ప్రభుత్వ ఏర్పాటు చేసింది.



అధునాతన ఫొటోథెరపీ వైద్య పరికరం

- 7 వార్మర్స్ కేర్, 5 ఫోటో థెరపీ, 2 పల్స్ ఆక్సిజన్, క్రిటికల్ కేర్ సేవలు అందించనుంది.
- నవజాత శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువుల ఆరోగ్యం సంరక్షించడమే ఈ యూనిట్ ముఖ్య ఉద్దేశం.
- అన్ని రకాల నియోనేటల్ సేవలు 24 గంటలూ అందనున్నాయి
- ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, సహాయక సిబ్బందిని నియమించారు

3 వేలు ప్రసవాలు దాటితేనే..

సంవత్సరానికి మూడు వేల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగే వైద్యశాలల్లో వీటిని తప్పకుండా ఏర్పాటు చేయాల్సి ఉంది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సగటున ఏటా 1,500 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఇక్కడ ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడానికి ఆస్కారం ఉండదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఏరియా వైశాలలో ప్రత్యేకంగా ఒక గదిని ఆధునీకరించి, సౌకర్యాలు కల్పించారు.

ఏరియా వైద్యశాలలో ప్రసవాలు

సంవత్సరం	ప్రసవాలు
2020	1,302
2021	1,481
2022	1,208
2023	1,640

అందరికీ మేలు



నవజాత శిశువులకు వార్మర్స్ కేర్ ద్వారా చికిత్సల అవసరమవుతాయి. ప్రత్యేక వార్డు ఏర్పాటుతో వారందరికీ మేలు జరుగుతుంది. భవిష్యత్తులో మరింత మందికి సేవలు అందించేలా విశాల దృక్పథంతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడం జరిగింది. ఏటా 1,500కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి.

– డాక్టర్ బి.లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

ప్రైవేటుకు దీటుగా సేవలు



నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రత్యేక ప్రమాణాలతో వైద్యశాలలో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రైవేట్ ఆస్పత్రుల కంటే భిన్నంగా ఇక్కడ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పేదలకు ఖరీదైన వైద్యం అందుతోంది.

– కొత్త రామకృష్ణ, అభివద్ధి కమిటీ డైరెక్టర్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

తల్లిదండ్రులపై తగ్గనున్న భారం...

- 34 వారాల గర్భధారణ సమయానికి ముందుగా జన్మించిన శిశువులు, గర్భధారణ వయసుతో సంబంధం లేకుండా పుట్టినప్పుడు, 1800 గ్రాముల బరువున్న శిశువులకు ఈ కేంద్రంలో చికిత్స అందిస్తారు.
- ప్రైవేట్ వైద్యశాలల్లో రోజుకు వైద్యం కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇప్పుడా ఖర్చు తల్లిదండ్రులకు మిగలనుంది.
- ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో పూర్తి ఉచితంగా చికిత్సలు అందుతాయి.
- నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో శిశువుల అసెస్‌మెంట్, ఫోటో థెరపీ, ఆక్సిజన్ థెరపీ, వార్మర్స్ కేర్, ఎక్స్ఛేంజ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ప్రీటర్మ్, ఎల్‌బీడబ్ల్యూ బేబీస్ కేర్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి.



నవజాత శిశు సంరక్షణ కేంద్రం వార్డు

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీలో జాప్యం తగదు



జగనన్న ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న డీఎస్‌ఓ పద్మశ్రీ

క్రోసూరు: మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారులు శుక్రవారం పలు గ్రామాలు సందర్శించారు. 88త్యాళ్లూరు, అనంతవరం, దొడ్లేరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాలు ఏ విధంగా అమలు జరుగుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జగన్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. కార్డులు అందని వారికి త్వరగా అందజేయాలని వలంటీర్లను కోరారు. జగనన్న ఆరోగ్యశ్రీ కార్డులు అందని వారు ఎంపీడీవో కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీకే సాధ్యం

అచ్చంపేట: సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీకే సాధ్యపడుతుందని నర్సరావు పేట పార్లమెంట్ పార్టీ సమన్వయకర్తగా పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి మరోమారు నిరూపించారని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సరావుపేట పార్లమెంట్ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలు ఓసీ అభ్యర్థులే ఉన్నా పార్లమెంటు స్థానం కూడా ఓసీలకు కావాలని కొందరు పట్టుబట్టినా.. నమ్మిన సిద్ధాంతం మేరకు నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా బీసీకి కేటాయించడం అభినందనీయమన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నరసరావుపేట ఎంపీగా బీసీ అభ్యర్థిని ప్రకటించడంపై హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి బీసీ సంఘాల క్షీరాభిషేకం

సత్తెనపల్లి: నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించిన నేపథ్యంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తాలూకా సెంటర్‌లో బీసీ సంఘాలు ముందుగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాలు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారిగా నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ అభ్యర్థిని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలు కేవలం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని, అవకాశాలను అగ్రకులాలకు కేటాయించటం జరిగిందన్నారు. మొదటి సారిగా వైఎస్సార్ సీపీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీసీ సంఘాల తరుపున స్వాగతిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీకి బీసీ సంఘాల తరుపున కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు. బీసీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ గెలుపు కోసం కలిసి కట్టుగా కృషిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కంటూ వెంకట్రామయ్య, బి.కమలాకర్, కుమ్మరి దస్తగిరి, గుంజి విజయ్, పులహరి బానోజీ, బాదరబోయిన శ్రీను, పిక్కిలి శివ, మార్లెళ్ల చిరంజీవి, గుంటూరు గోవిందు, క్యాలిబర్ జానీ, చావల వెంకటేశ్వర్లు, విప్పర్ల కొండలు, పిక్కిలి రత్తయ్య, గోగుల శ్రీను, మార్త రాఘవేంద్ర, బూర్సు శ్రీనివాసరావు, చట్టు శివయ్య, చావల కొండ, వేదులాపురపు శ్రీనాద్, దంతం శ్రీను, గంపా వేణు, పిల్లకతుపుల నాగేశ్వరరావు, గొల్లపల్లి శ్రీను, గంటా మహేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం



గుండ్లపల్లిలో పంటను కాటా వేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగు ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సైదయ్య అన్నారు. గుండ్లపల్లి గ్రామంలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న కంది పైరులో పంటకోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కోపూరి గోపి సాగు చేస్తున్న పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో 660 కేజీల కంది దిగుబడి వచ్చిందన్నారు. అంతర పంటలుగా మినుము, పెసర, దోస పండించినట్లు తెలిపారు. అంతర పంటల ద్వారా రూ.15వేల ఆదాయం వచ్చిందని చెప్పారు. కంది ద్వారా వచ్చిన ఆదాయం నికర ఆదాయంగా రైతుకు మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, బాజీబాబు, రామసుబ్బారెడ్డి, పురుషోత్తం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంటర్నెట్..కేబుల్ ఆపరేటర్లకు సదావకాశం



ఇంటింటికీ ఇంటర్నెట్ బ్రోచర్ల ఆవిష్కరణలో జిల్లా మేనేజర్లు, కేబుల్ ఆపరేటర్లు

- సచివాలయాలు కేంద్రాలుగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు
- ట్రిపుల్ ప్లే సర్వీసుతో టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు
- వెల్లడించిన ఫైబర్ నెట్ జిల్లా మేనేజర్లు

అమరావతి:ఇంటింటికి ఇంటర్నెట్ సదుపాయం అందించాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అతి తక్కువ ధరకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చిందని ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ జిల్లా మేనేజర్లు సీహెచ్ శివశంకర రెడ్డి, ఎస్.పులి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అమరేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని హరితా రిసార్ట్స్‌లో నిర్వహించిన కేబుల్ అపరేటర్‌ల సమావేశంలో వారు ఇంటింటికి ఇంటర్నెట్ అందించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఛానల్, సినిమాలు అన్నీ.. యాప్స్ రూపంలో రాబోతున్నందున ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ నిత్యావసరంగా మారిందన్నారు. ప్రైవేట్ నెట్ వర్క్ ద్వారా సర్వీస్‌లను తీసుకుంటే రూ.లక్షల్లో ఖర్చవుతుందన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామాల్లో పంచాయతీ ఆఫీస్‌లకు ఉచితంగా సర్వీస్ అందిస్తుందన్నారు. ఇంటింటికి ఇంటర్నెట్ అందించటానికి సిగ్నలింగ్ వ్యవస్థను సచివాలయ ఆఫీస్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మొదటగా గ్రామాలలో కేబుల్ అపరేటర్‌ల ద్వారా ఇంటర్నెట్ సర్వీస్‌లను అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రతి కేబుల్ ఆపరేటర్ గ్రామ సచివాలయంలోని సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా ఇంటర్నెట్ సర్వీస్‌లు అందించడానికి ఆకర్షణీయమైన కమీషన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. కేబుల్ అపరేటర్‌లు ప్రభుత్వం అందిస్తున్న ఇంటర్నెట్ సర్వీస్‌లను వినియోగదారులకు తక్కువ ధరకు అందించి ఎక్కువ లాభాలను పొందవచ్చునన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ప్రముఖ కంపెనీల నెట్‌వర్క్‌లలో ఆరు నెలల ప్యాకేజీ రూ.4వేలు కాగా, ఆదే ప్యాకేజీ ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌లో రూ.2,900లకే ఇస్తున్నామన్నారు. నెలకు రూ.190, రూ.250లకు ప్యాకేజీలు అందిస్తామన్నారు. త్వరలో ట్రిపుల్ ప్లే సర్వీస్‌లు అనగా టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సర్వీస్ అందించనున్నట్లు చెప్పారు. జిల్లా కార్యాలయంలో ఇంటర్నెట్ బాక్స్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అందువల్ల ఇప్పుడు ఎవరైతే ముందుగా సర్వీస్‌లు స్టార్ట్ చేసి వ్యాపారం చేస్తారో వారికి ముందు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి కేబుల్ అపరేటర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిందని కమిటీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుల్లా రాజారావు అధ్యక్షతన కార్యవర్గ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గానికి రెండు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్మృతివనం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నూతన అధ్యక్షుడు గార్లపాటిదాసు మాట్లాడుతూ పల్నాడు జిల్లా కలెక్టర్ ఐడీ కార్డులు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా మిగత జిల్లాల డీవీఎంసీ సభ్యులకు త్వరలో ఇస్తారని తెలిపారు. డీవీఎంసీ సభ్యులకు ఉచితంగా బస్‌పాస్‌లివ్వాలి, జెడ్పీ సమావేశాల్లో కమిటీ సభ్యులకు ప్రొటోకాల్ పాటించాలని, 20 సంవత్సరాల నుంచి దళితులకు భూములు పంచలేదని, నిరుపేదలకు భూములు పంచాలన్నారు. ప్రభుత్వ భూముల అసైన్మెంట్ కమిటీలో డీవీఎంసీ సభ్యులకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నందు ఉద్యోగాలన్నీ ఎస్సీలకే కేటాయించాలన్నారు. ఏపీ ఎస్సీ కమీషన్ మెంబర్ గా బుల్లారాజారావును నియమించాలని కోరారు.

ద్విచక్రవాహనం నుంచి పడి మహిళ మృతి

విజయపురిసౌత్: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మాచర్ల మండలం పశువేముల సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతలతండాకు చెందిన రమావత్ బుజ్జిబాయి(42) తన కొడుకుతో కలసి ద్విచక్ర వాహనంపై మాచర్ల నుంచి చింతలతండాకు వస్తోంది. ఎరిగ్గా పశువేముల సమీపంలోకి రాగానే ఆమెకు బీపీ తగ్గి బైక్‌పై నుంచి కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ కె.వెంకట కొండారెడ్డి తెలిపారు.

లేగదూడల పోషణలో మెళకువలు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు

సత్తెనపల్లి: లేగ దూడల పోషణలో మెళకువలు తప్పనిసరిగా పాటించాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పి.రామారావు అన్నారు. కొమెరపూడి గ్రామంలోని పశు వైద్యశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి రైతులు లేగ దూడల పోషణలో మెలకువలను గ్రహించి పాటించాల న్నారు. సహాయ సంచాలకుడు డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పశువులకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. సత్తెనపల్లి ఏడీ డాక్టర్ మంగు శ్రీనివాసరావు పశువుల్లో పిండ మార్పిడి పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు సూచించారు. ప్రదర్శనకు 45 లేగ దూడలను తీసుకురాగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మిగిలిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 35 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ శ్యామ్‌సన్, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి ఐబూన్‌బీ ఇస్సా, గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, పశువైద్యాధి కారులు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా గణితం బోధించాలి

సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: అభివృద్ధి చెందిన దేశాల్లో అమలు చేస్తున్న విద్యా విధానాన్ని ఆకళింపు చేసుకొని గణిత ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారు నైపుణ్యం సాధించేలా చూడాలని సత్తెనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, పెదకూరపాడు, మండలాల గణిత ఉపాధ్యాయులకు ఒక రోజు ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ అండ్ టెక్నాలజీ(ఐసీటీ)పై శిక్షణ కార్య క్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కోర్సు డైరెక్టర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.లతా ప్రియదర్శిని, మండల విద్యాశాఖ అధికారి రాఘవేంద్రరావు వ్యవహరించారు. ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకమైన పోటీ వాతావరణంలో చక్కగా చదవాలన్నారు. అర్థం కాని, విషయం చిన్నదైనా సరే ఉపాధ్యాయులు నివృత్తి చేసి, మంచి మార్కులతో అందరూ ఉత్తీర్ణత సాధించలా చూడాలన్నారు. శిక్షణకు రిసోర్స్ పర్సన్స్‌గా ఎం.నరేంద్ర, జి.శ్రీనివాసరావు బాలకృష్ణారెడ్డిలు వ్యవహరించారు. ఆరు మండలాల గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో కంది కొనుగోలు కేంద్రాలు

ముప్పాళ్ళ: రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని మాదల, ముప్పాళ్ళ గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కంది పంటలో యాజమాన్య పద్ధతులు, కందుల సేకరణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో కంది పంట విరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రస్తుతం క్వింటాకు రూ.7వేలు మద్దతు ధర ప్రకటించిందని, అయినప్పటికీ మార్కెట్ ధరకు అనుగుణంగానే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు. ముందుగా సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని వీఏఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

అనిల్‌కుమార్ యాదవ్ నియామకం హర్షణీయం

మాచవరం: నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రకటించడం హర్షణీయమని జెడ్పీటీసీ జెవ్వనబోయిన శివాయాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం మండల కన్వీనర్ జంగాల సురేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ పార్టీ అధినేత సీఎం జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి సారి నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించడం సంతోషకరమన్నారు. బీసీలంటే వెనుకబడిన తరగతులు కాదని, వెన్నెముకగా గుర్తించి, పార్టీలో అధిక ప్రాధాన్యత కల్పిస్తూ బీసీలకు ఉన్నత పదవులు ఇచ్చి ఆత్మ గౌరవాన్ని పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీలంతా వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉండి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేనేత విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలను తొలగించిన అధికారులు



పిడుగురాళ్ల: పట్టణంలోని సుందరయ్య కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో అనధికారికంగా గుడిసెలు వేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ టీపీఎస్‌వో అనురాధ అనధికారికంగా గుడిసెలు వేసిన వారి వివరాలను సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఇళ్ల పట్టాలు అందించి, ఇళ్లు నిర్మించి ఇస్తుంది. ఈ క్రమంలోనే ఇటీవలే సుందరయ్య కాలనీలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. అర్హత ఉన్న వారు ఇంకా ఎవరైనా ఉంటే వారు నేరుగా నమోదు చేసుకోవచ్చని, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని టీపీఎస్‌వో వివరించారు. ఇలా అనధికారికంగా గుడిసెలు వేయటం సరికాదని ఆమె అన్నారు. వెంటనే మున్సిపల్ కార్యాలయానికి చెందిన జేసీబీతో గుడిసెలను, డేరాలను తొలగింపజేశారు. అర్హత ఉన్న వారు ఎవరైనా ఉంటే ప్రభుత్వం పట్టాలిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

